క్లుప్తంగా

విద్యార్థులకు లంచ్ బ్యాగుల వితరణ



విద్యార్థులకు లంచ్ బ్యాగులు అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతా కల్యాణ్ అనురాగ నిలయంలోని విద్యార్థులకు నగరానికి చెందిన జి.కృష్ణ లంచ్ బ్యాగులు, పెన్నులు, పుస్తకాలను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు చేతులమీదుగా సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణ ఒక మోటారు మెకానిక్‌గా పనిచేస్తూ సామాజిక బాధ్యతతో అనురాగ నిలయం విద్యార్థులకు లంచ్ బ్యాగులు, విద్యా సామగ్రి అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైకుంఠరావు, కనుగుల దుర్గాశ్రీనివాసరావు, డాక్టర్ నిక్కు అప్పన్న, లలిత, సాయి సుధాకర్, ఆశ, సేవకులు ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, దాతలు కృష్ణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య సంకీర్తన



కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

గార: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ అంబటివానిపేటలో సోమవారం తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తన గాన యజ్ఞం నిర్వహించారు. శ్రీకాకుళం నగరానికి చెందిన స్వరాధిక సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో కేవీ ఉమామహేశ్వరరావు కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో అంబటి చక్రధరరావు, సాధు జయరాందాస్ నాయుడు, శీర సత్యనారాయణ, బృందావనం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవోలు

జి.సిగడాం: ప్రతీ బాలిక ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యనభ్యసించాలని ఎంఈవోలు అరసాడ రవి, ముల్లు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కేజీబీవీని సోమవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విద్యపై ప్రత్యేక దృష్టి సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించారు. వీరితో పాటు ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల ఉన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



ఓటర్ల జాబితాపై నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయిప్రత్యూష అధ్యక్షతన శ్రీకాకుళం నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల సంఘం ఆదేశాలు ప్రకారం మంచి ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఎన్నికల సంఘం ప్రీ రివిజన్ యాక్టివిటీ షెడ్యూల్ ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్.గణపతిరావు, శ్రీకాకుళం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాసరావు, మాదారపు వెంకటేష్, జనార్దన, ఆర్.శంకరరావు, ఆర్.పురుషోత్తం, బి.అర్జునకుమార్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



ఎంపీడీవో రామ్మోహన్‌రావును సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గార: విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలే ఉద్యోగులకు గుర్తింపునిస్తాయని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. సోమవారం ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు పదవీ విరమణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోగా మండలంలో ఉన్నత విలువలతో పనిచేశారన్నారు. అనంతరం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, గొండు జగపతి, తహసీల్దార్ ఎం.చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీస గోపి, బరాటం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు.. ఫలితాలు బాగు..!



ఘన జీవామృతాన్ని తయారు చేస్తున్న మహిళలు

- ప్రకృతి వ్యవసాయంపై రైతుల ఆసక్తి
- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- ఆరోగ్యకరమైన ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ

ఎచ్చెర్ల: మండలంలో ప్రకృతి వ్యవసాయం జోరందుకుంది. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి, భూసారాన్ని పరిరక్షించడానికి ప్రకృతి వ్యవసాయం ఉపయోగకరంగా ఉంటుంది. దీంతో ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం ప్రతీ ఏడాది పెరుగుతూ వస్తోంది. ప్రకృతి వ్యవసాయం సాగు వల్ల ఖర్చులు తగ్గడం, దిగుబడులు పెరగడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ప్రస్తుతం 22 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్య రైతులతో పాటు ఇతర రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించారు. మండలంలోని కేశవరావుపేట, ఫరీదుపేట, ఎస్ ఎంపురం, ధర్మవరం, పొన్నాడ, తమ్మినాడుపేట, కొత్తపేట, కొంగరాం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. వీరంతా దాదాపు సన్న, చిన్నకారు రైతులే. ఆకుకూరలు, కూరగాయలు, బొప్పాయి, నిమ్మ, మామిడి, జీడిమామిడి, వరి తదితర పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నారు.

సహజ ఎరువుల వినియోగం

సేంద్రీయ విధానంలో పంటల సాగుకు ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలు, ద్రవాలతో తయారు చేసిన ఎరువులు, క్రిమి సంహారక కషాయాలను వినియోగిస్తున్నారు. రసాయనిక ఎరువుల కంటే ఇవి తక్కువ ధరకు లభిస్తుండడంతో వీటిపై దృష్టి నిలిపారు. జీడిమామిడి పూతపై పురుగుల నివారణకు, పూత నిలవడానికి మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని, ఎరువుగా వాడడానికి ఆవు పేడ, బెల్లం, పప్పు దినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారు చేసిన ఉండలను పంటలకు ఎరువుగా వాడుతున్నారు. అలాగే వీటికి నీటిని కలిపి తయారు చేసిన ద్రవ జీవామతాన్ని పంటలపై చీడ, పీడల నివారణకు, పంట బలంగా ఎదిగేందుకు వినియోగిస్తున్నారు. అగ్గి తెగులు నివారణకు మారేడు కషాయం, వరిలో సుడిదోమ నివారణకు రేడియో మొక్కల ఆకులతో తయారుచేసిన కషాయం, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తూ పంటలను పండిస్తున్నారు. వీటిని కొందరు రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటు చేసిన మినీ దుకాణాల ద్వారా కొనుగోలు చేసుకుని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు.



ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు

మార్కెట్ విస్తరణతో ఆసక్తి

మండలంలోని గ్రామాల్లో ప్రకృతి సిద్ధంగా పండిన పంటల గురించి తెలుసుకుని, ఇతర ప్రాంతాల ప్రజలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా ఉత్పత్తులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో రైతులు తమ ఉత్పత్తులకు మార్కెట్ లభిస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరింత మంది ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపేలా వెలుగు, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలను నిర్వహించి ప్రకృతి వ్యవసాయం సాగుకు ప్రోత్సహిస్తున్నారు. దీంతో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపుతున్నారు.

22 పంచాయతీల్లో సాగు



మండలంలోని 22 పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారు. మిగిలినవారు పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి వ్యవసాయం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయానికి కృషి చేస్తున్నాం. రైతుల్లో నమ్మకం పెరగడం వలన గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది.

– సీహెచ్ సూర్యనారాయణ, ఎస్‌డీఏ, ప్రకృతి వ్యవసాయం

అంతర పంటతో ఆదాయం



బొప్పాయి, ముల్లంగి పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెంచుతున్నాం. ఇవి ఏపుగా ఎదిగాయి. ఫలసాయానికి వచ్చేలోగా అదనపు ఆదాయం కోసం అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరల సాగు చేపట్టాం. ఇవికూడా ఏపుగా ఎదిగి విక్రయానికి సిద్ధమవుతున్నాయి.

– సూర అప్పన్న, రైతు, కేశవరావుపేట

భూములు సారవంతం

ప్రకృతి వ్యవసాయం వలన భూములు సారవంతమవుతున్నాయి. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆకుకూరలు సాగవుతున్నాయి. పట్టణం, దూర ప్రాంతాల నుంచి మా గ్రామాల మీదుగా వెళ్లేవారు ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రకృతి వ్యవసాయం సాగుతో ఆశించిన రాబడి వస్తుంది.

– గొలివి రామకష్ణ, రైతు, గొలివివానిపేట

ప్రజలకు కార్యకర్తలు అండగా నిలబడాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వంలో ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అండగా నిలబడాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో వెల్పురాయి, దేవరాపల్లి పంచాయతీల కార్యకర్తలతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం నిస్వార్థంగా పనిచేసేవాడు కార్యకర్త మాత్రమేనని కొనియాడారు. పార్టీ అధికారంలో లేకపోయినా కూడా కార్యకర్తల్లో ఓటమి చెందామనే నిరాశ కంటే, మరలా గెలుపు బాటలో పయనిద్దామనే ఆత్మవిశ్వాసమే ఎక్కువగా కనిపిస్తోందని పేర్కొన్నారు. కార్యకర్తలంతా సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో రణస్థలం మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, సర్పంచ్ మీసాల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కెల్ల రామకృష్ణ, ఎంపీటీసీ గురాన ప్రసాదరావు, నాయకులు మీసాల రమేష్, యలకల అయ్యప్పల నాయుడు, మీసాల వెంకటేశ్వరరావు, రామకృష్ణ, కృష్ణారావు, నాగేశ్వరరావు, జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనతో సరి..?



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

రణస్థలం: మండల కేంద్రంలోని జే.ఆర్.పురం వేంకటేశ్వర కాలనీ నుంచి బండిపాలెం వరకు బీటీ అండ్ సీసీ రోడ్డు వేసేందుకు పల్లె పండుగ పేరుతో జనవరిలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో బండిపాలెం నుంచి వేంకటేశ్వర కాలనీ వరకు తారు రోడ్డు, కాలనీ మధ్యలో సీసీ రోడ్డుకు కలిపి భూమిపూజ నిర్వహించారు. రోడ్డు వేస్తామని అప్పటివరకు ఉన్న రోడ్డుపై భాగం మొత్తం తవ్వేశారు. కానీ దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా ఇంకా రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ఆ రాళ్లతేలిన, బురద రోడ్డు వెంబడి వెళ్లే ప్రజలు నరకం చూస్తున్నారు. కాగా మరలా సోమవారం వేంకటేశ్వర కాలనీలో కూటమి నాయకులు అదే బీటీ రోడ్డులో భాగమైన సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేయడం గమనార్హం. దీంతో శంకుస్థాపనలేనా... రోడ్డు వేసేది ఉందా అంటూ స్థానికులు గుసగుసలాడుతున్నారు.

అధిష్టానం దృష్టికి అధ్యక్షుడి ఎంపిక

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగర టీడీపీ అధ్యక్షుడి ఎంపిక స్థానికంగా తేల్చలేకపోవడంతో ఈ పంచాయితీ రాజధాని స్థాయికి చేరింది. ఎమ్మెల్యేలు, పార్లమెంట్ సభ్యులతో ఆ పార్టీ అధిష్టానం సమావేశం ఏర్పాటు చేయడంతో, ఈ సందర్భంగా వెళ్లిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ నగర పార్టీ అధ్యక్షుడి ఎంపిక విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ రేసులో మాదారపు వెంకటేష్, పాండ్రంకి శంకర్, కోరాడ హరిగోపాల్, ఉంగటి రమణ, ఇప్పిలి తిరుమలరావు, దొండపాటి నవీన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అయితే మూడు సార్లు మాదారపు వెంకటేష్ నగర పార్టీ అధ్యక్షుడిగా పనిచేయడంతో ఆయనకి మరోసారి ఆ పదవినిచ్చే దాఖలాలు తక్కువగా ఉన్నాయి.

నిస్వార్థ సేవకు సత్కారం



ఉద్యోగ విరమణ పొందినవారితో ఎస్పీ మహేశ్వరరెడ్డి, అదనపు ఎస్పీ రమణ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం నిస్వార్థ సేవలందించి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని, శేష జీవితాన్ని ఆరోగ్యంగా గడపాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీసు కార్యాలయంలో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సన్మానం పొందినవారిలో ఎస్‌ఐలు ఆర్.శంకరరావు, వి.నేతాజీ, ఎన్.కృష్ణారావు, పీఎస్ నారాయణ, ఏఎస్‌ఐలు బీవీ సత్యనారాయణ, ఆర్.రవికుమార్, వై.నర్సింహులు, బి.రామినాయుడు, హెడ్ కానిస్టేబుళ్లు కె.మల్లేశ్వరరావు, బి.మాధవరావు, స్వీపర్లు బి.గన్నయ్య, ఎన్.లలిత, హోంగార్డులు ఆదినారాయణ, సూర్యనారాయణలు ఉన్నారు.

ప్రత్యేక అలంకరణలో జగన్నాథుడు



గుజరాతిపేటలో నరసింహ అవతారంలో జగన్నాథుడు



ఇల్లీసుపురంలో వరాహ అవతారంలో జగన్నాథస్వామి

శ్రీకాకుళం కల్చరల్:

పట్టణంలో గుజరాతీపేటలోని జగన్నాథస్వామి దేవాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న రథయాత్రలో భాగంగా స్వామివారిని ప్రత్యేకంగా సోమవారం అలంకరించారు. ఆలయ అర్చకులు పెంట సోదరుల ఆధ్వర్యంలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే ఇల్లీసుపురం కూడలిలో జగన్నాథ స్వామిని వరాహ అవతారంలో అలంకరించారు. సుభద్ర, బలభద్రులతో పాటుగా జగన్నాథస్వామిని అలంకరించగా, భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలకృష్ణ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు. మొండేటివీధిలోని శివకామేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో షిరిడిసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రథయాత్రలో భాగంగా స్వామివారిని జగన్మోహినీ అవతారంలో అలంకరించారు. అలాగే పాండ్రంగి వీధి రామ మందిరంలో స్వామివారిని గోవర్ధన గిరిధారిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదుల ప్రదీప్, ధర్మకర్త నర్సింహమూర్తి పాల్గొన్నారు.



మొండేటివీధిలో జగన్మోహిని అవతారంలో..



గోవర్ధన గిరిధారిగా పాండ్రంగి వీధిలో...

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలం: మండలంలోని జే.ఆర్.పురం పంచాయతీ సీతంవలస గ్రామానికి చెందిన గండమాన అసిరివాడు ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ముద్దాడ రాజశేఖర్, సర్పంచ్ కంబపు నరసింహులు తదితరులు ఉన్నారు.

జి.సిగడాం: మండలంలోని పెనసాం గ్రామానికి చెందిన పిల్లల శ్రీరామమూర్తి, జి.సిగడాం గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు మెంబర్ దున్నా రాంప్రసాద్, పెంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పున్నాన ధనలక్ష్మి, మీసాల హైమావతిల తల్లి నారాయణమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాలను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం అనారోగ్యంలో బాధపడుతున్న పెంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల రాజరత్నంనాయుడుని పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ మోసాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

జి.సిగడాం: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పెంట గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందలేదన్నారు. జగనన్న ప్రభుత్వ హయంలో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే లక్షా 50 వేల ఉద్యోగాలు కల్పించారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ ఫలాలను అందించామన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, సర్పంచ్ పున్నాన అక్కలనాయుడు, ఎంపీటీసీలు మక్క శ్రీనివాసరావు, గేదెల నారాయణరావు, నాయకులు బత్తుల చంద్రశేఖర్, పోలారావు, మక్క రాంబాబు, సుగణకరావు, సత్యనారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



పల్లె పండగ పేరుతో రోడ్లు వేస్తామని హడావుడి చేసిన కూటమి నాయకులు రోడ్లు తవ్వేసి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నామని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సంతవురిటి నుంచి విజయరాంపురం, సీతారాంపురం నుంచి సంతవురిటి వరకు రోడ్డుపై నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. బాగా ఉన్నటువంటి రోడ్డును తవ్వేసి ఇంతవరకు వేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

– జి.సిగడాం

అల్లుకున్న నిర్లక్ష్యం



రణస్థలం మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఎస్సీ కాలనీ వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి, వైర్లకు తీగలు అల్లుకొని ఉన్నాయి. దీంతో విద్యుత్ లైన్లు పాడైపోయి షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– రణస్థలం